

శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మ
ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలన
సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధిం
సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవా
saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు


సంపుటి : 10

సంచిక : 2

**నేపథ్యం:**

**కృతజ్ఞత**

ఆషాఢ పౌర్ణమి

July 29, 2026



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

పూజ్యశ్రీ
సుబ్బరామయ్య
సార్ ప్రవచనం

విశ్వాసమును దృఢ పరుచుకునే విధానము

సద్గురువు ప్రసాదించిన అనుభవాలను నిరంతరం స్మరించుకోవటం వల్ల మనకు విశ్వాసము దృఢం అవుతుంది. కృతజ్ఞతా పూర్వక జీవనము సాధ్యం అని తెలిపే శ్రీ సార్ స్పీచ్.

**అనేక జన్మ సంప్రాప్త కర్మ బంధ విదాహినే**
**జ్ఞానానల ప్రభావేన తస్మై శ్రీ గురవే నమః**

## విషయ సూచిక



| | |
|---|---|
| **సంపాదకీయం** | **4** |
| **భక్తుల అనుభవాలు** | **8** |
| **శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు** | **12** |
| **సార్ సత్సంగం** | **25** |
| **కోరికలు అన్నీ సిద్ధించును గురుకృప కలిగిన** | **25** |
| **మహాత్ముల వాక్యాలు** | **29** |


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి






# సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధర్గాస్వామి

# సంపాదకీయం

**ఓం సాయిరాం**

**కృతే చ ప్రతికర్తవ్యమేష ధర్మః సనాతనః ।**
**సోయం త్వత్ప్రతికారార్థీ త్వత్తః సమ్మానమర్హతి ॥**

— శ్రీమద్రామాయణము, సుందరకాండ, ప్రథమ సర్గ

**"మనకు మేలు చేసిన వారికి ప్రత్యుపకారం చేయుట ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఇదే సనాతన ధర్మ స్వరూపం."**

లంకకు వాయు వేగంతో ప్రయాణిస్తున్న వాయుపుత్రుడు శ్రీ ఆంజనేయస్వామి ని ఉద్దేశించి మైనాకుడు ఈ విధంగా ప్రార్థిస్తాడు. **ఇక్ష్వాకు వంశస్థుడైన సాగర చక్రవర్తి** వల్ల తనకు కలిగిన ఉపకారాన్ని స్మరించుకుంటూ, ఆ వంశానికి చెందిన శ్రీరాముని కార్యసిద్ధికి తాను చేయగల సహాయంగా హనుమంతుడికి విశ్రాంతి కల్పించాలని సముద్రుడు సంకల్పించాడని వివరిస్తాడు. "మేలు చేసిన వారికి ప్రత్యుపకారం చేయడం సనాతన ధర్మం. అందుకే సముద్రుడు నీకు సేవ చేయదలచాడు. అతని ఆతిథ్యాన్ని స్వీకరించడం ద్వారా అతనిని అనుగ్రహించు" అని మైనాకుడు వినయపూర్వకంగా ప్రార్థిస్తాడు.


ఇక్కడ రెండు విశేషాలను స్మరించుకోవాలి.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

ఇక్ష్వాకు వంశానికి చెందిన అరవై నాలుగు వేలమంది సగరపుత్రులు యజ్ఞాశ్వాన్ని వెదుకుతూ భూమిని త్రవ్వడం వల్లే సముద్రానికి "సాగరము" అనే పేరు ప్రసిద్ధి చెందింది.

అలాగే మైనాకుడు రెక్కలు కలిగిన పర్వతాలలో ఒకడు. రెక్కలతో సంచరించే పర్వతాల వల్ల లోకాలకు కలిగిన ఇబ్బందిని తొలగించేందుకు ఇంద్రుడు వాటి రెక్కలను ఖండించాడు. ఆ సమయంలో వాయుదేవుడు తన స్నేహితుడైన మైనాకుడిని రక్షించి సముద్ర గర్భంలో ఉంచాడు. ఆ ఉపకారాన్ని మైనాకుడు ఎన్నటికీ మరువలేదు. అందుకే వాయుపుత్రుడైన హనుమంతునికి సేవ చేయాలనే తపనతో ముందుకు వచ్చాడు.

ఈ సంఘటన మనకు ఒక మహత్తరమైన జీవన సూత్రాన్ని బోధిస్తుంది. **ధర్మంతో సంపాదించిన అర్థం (సంపద), ధర్మబద్ధంగా అనుభవించిన కామం (సుఖం) చివరకు మోక్షానందానికి దారి తీస్తాయి.** ఆ మోక్షమార్గానికి తొలి మెట్టు ధర్మమే.

మైనాకుడు బోధించిన ఈ ధర్మసూత్రం — **"మేలు చేసిన వారికి ప్రత్యుపకారం చేయుట ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఇదే సనాతన ధర్మ లక్షణం."** — మన జీవితానికి మార్గదర్శకం. ఈ ప్రత్యుపకార భావనకు మూలం **కృతజ్ఞత**. మన హృదయంలో కృతజ్ఞత ఎంతగా వికసిస్తుందో, అంతగా మన జీవితం ఆనందమయం అవుతుంది.



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దగ్గాస్వామి

సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తరచూ ఒక ప్రశ్న వేస్తారు — *"భగవంతుడు మననుంచి ఏమి కోరుతారు?"* వెంటనే ఆయనే సమాధానం చెబుతారు — **"మనస్సు, కాలము, కృతజ్ఞతా భావం."**

కృతజ్ఞత మనస్సును పవిత్రం చేస్తుంది. మనం ఎవరికి వారు స్వయంగా జీవిస్తున్నామని భావించినా, వాస్తవానికి ఈ జగత్తులోని ప్రతి మనిషి, ప్రతి జీవి, ప్రతి ప్రకృతి శక్తి మన జీవితానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సేవ చేస్తూనే ఉన్నాయి. ఈ సత్యాన్ని గ్రహించినప్పుడు, మనకు చేతనైనంతగా సమాజానికి సేవ చేయాలనే తపన సహజంగా కలుగుతుంది.

ఈ కృతజ్ఞతను ఆచరణలో వ్యక్తపరచే మహత్తరమైన సాధనే **కాకబలి**. సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ "అవధూత లీల"లో వివరించిన కాకబలి తత్వాన్ని మనసారా గ్రహించి ప్రతిరోజూ భగవత్స్మరణతో ఆచరించాలి.

శ్రీ స్వామివారు తమ ఆచరణ ద్వారా కాకబలి యొక్క అంతరార్థాన్ని మనకు బోధించారు. మనం భుజించే ప్రతి అన్నం ముద్ద వెనుక అసంఖ్యాక జీవుల శ్రమ దాగి ఉంది. ఒక బియ్యపు గింజ మన చేతికి చేరాలంటే రైతు కష్టం, భూమి సహకారం, వర్షం, సూర్యకాంతి, గాలి, నీరు, వ్యవసాయ పరికరాలు, వాటిని తయారు చేసిన అనేక మంది కార్మికులు, ఎరువులను తయారు చేసిన సూక్ష్మజీవులు—ఇలా లెక్కలేనన్ని జీవులు, శక్తులు కలిసి పనిచేస్తాయి.

మన ఇల్లు, వంట పాత్రలు, ఇంధనం, వస్త్రాలు, పాల నుండి నెయ్యి వరకు, పప్పు నుండి కూరగాయల వరకు—మనకు లభించే ప్రతి వస్తువు వెనుక ఎన్నో చేతుల కష్టం దాగి ఉంది. అంతేకాదు, మనం భుజించిన ఆహారాన్ని జీర్ణం చేయడానికి కూడా మన శరీరంలో నివసించే కోట్లాది సూక్ష్మజీవులు నిరంతరం సేవ చేస్తున్నాయి.

ఈ సమస్త కార్యరూపాల వెనుక పనిచేస్తున్నది పరమాత్మే. జీవుల రూపంలోనూ, పంచభూతాల రూపంలోనూ ఆయనే మనకు అన్నం, వస్త్రం, నివాసం సమకూరుస్తున్నాడు. ఈ సత్యాన్ని గుర్తించి ప్రేమతో, కృతజ్ఞతతో సమర్పించేదే కాకబలి.

*"ఓ ప్రభూ! అసంఖ్యాకమైన జీవుల రూపంలోనూ, పంచభూతాల రూపంలోనూ నిరంతరం కృషి చేసి నాకు ఈ ఆహారాన్ని ప్రసాదించావు. ఈ సమర్పణను స్వీకరించి నన్ను నీ ఋణవిముక్తుడిని చేసి ఎల్లప్పుడూ కృతజ్ఞునిగా ఉంచుము"* — అనే భావంతో సమర్పించే ప్రతి కాకబలి నిజమైన ఆరాధన అవుతుంది.

కాకబలి అనేది కేవలం పిడికెడు అన్నాన్ని బయట ఉంచడం కాదు; కృతజ్ఞతతో నిండిన హృదయాన్ని భగవంతునికి సమర్పించడం. అందుకే పెద్దలు కాకబలిలో ముఖ్యమైనది ఆహారం కాదు, **హృదయం** అని చెప్పారు. శ్రీ స్వామివారు దానిని తమ జీవితంతో ఆచరించి చూపించారు. మనమూ ఆ మార్గాన్ని అనుసరించి ఋణవిముక్తులమవాలని వారి బోధ.

సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ స్వామి సేవకు విస్తృతమైన అర్థాన్ని చెప్పారు. ప్రదక్షిణలు చేయడం, పారాయణ చేయడం, సద్గురువు చేసిన మేలును స్మరించుకోవడం, నలుగురికి ఉపయోగపడే పనులు చేయడం—ఇవన్నీ స్వామి సేవే. సద్గురువు మనపై కురిపించిన కృపకు మనం సమర్పించగల గొప్ప ప్రత్యుపకారం **కృతజ్ఞతతో కూడిన సేవామయ జీవితం** గడపడమే.

## భక్తుల అనుభవాలు

ఓం సాయిరాం

2026, జులై 19వ తారీకు బెంగళూరులో మాస్టర్ EK గారి గురు పూజలు జరిగాయి. ఆ గురు పూజలలో వాలంటీర్ గా పనిచేసిన ప్రసాదుకు శ్రీమాన్ అనంత కృష్ణ మాస్టర్ గారు మంద్ర స్క్రిప్చర్స్ అనే బుక్ ను, శాలువాను ఒక బాగ్ లో ఉంచి ఆశీర్వదించి ఇచ్చారు. బ్యాగును చేత్తో పట్టుకోవటం కన్నా కారులో పెట్టుకొని వస్తే పట్టుకొని తిరగటం అనేది ఉండదు కదా అని కారు దగ్గరికి వెళ్ళినప్పుడు కారు లోపల వేడిగా ఉంది. అంత వేడిలో మాస్టర్ EK గారిని (పుస్తకము మీద ఉన్న ఫోటో) ఉంచటం బాగుండదు అనుకున్నా ఫర్వాలేదులే అని కారులో పెట్టేసాను. రెండు గంటల తరువాత ఇంట్లో వారు ఇంటి నుండి వస్తూ రాత్రికి భోజనం కారియర్ లో తీసుకొచ్చారు. అది కూడా కారులో పెడదామనుకున్నాను. కానీ వేడి వల్ల ఆహారం అంతా పాడు అవుతుంది అని కారులో పెట్టలేదు.

రాత్రికి ఇంటికి వెళ్ళే ముందర అన్నం తిందామనుకుంటే భోజనం కారియర్ పెట్టిన బాగ్ కనపడలేదు. పైగా కారును పార్కింగ్ నుండి బయటకు తీయటానికి అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాలను తీయటానికి ప్రసాద్ కుమారుడు, ప్రసాద్ చాలా కష్ట పడాల్సి వచ్చింది. అప్పుడు అర్థం అయ్యింది ఏమిటంటే మాస్టర్ EK గారి ఫోటో అంటే సాక్షాత్తు ఆయనే అని అర్థమైంది. అందువలన చేసిన పనికి ప్రాయశ్చిత్తంగా ప్రసాద్ ఆ రోజు రాత్రి అన్నం తినలేదు.


తిక్కవరప్పాడు హరిజనవాడ 22 సం॥ కుర్రవానికి మూత్రంలో వీర్యం పోతున్నందున పూర్తి నిస్సత్తువ కలిగి, ఆహారం మామూలు కంటే ఎక్కువ తింటాడు, ఎప్పుడూ పడుకొని ఉంటాడు. ఇంగ్లీషు మందులు, మంత్రతంత్రాలు అయిపోయి చివరి ఆశగా శ్రీ స్వామి నాశ్రయించాడు. మూడవ రోజుకు బాగయి పోయింది. నాల్గవరోజు ఒక టెంకాయ శ్రీ స్వామికి సమర్పించి ఇంటికి వెళ్ళాడు. రెండు రోజులు బాగుండి మరలా నిస్సత్తువయింది. మరలా గొలగమూడి వస్తే ఐదవ నాటికి బాగయింది. ఆరవ రోజు ఇంటికి పోయాడు, మరలా రెండు రోజులు తర్వాత అనారోగ్యం, మరలా గొలగమూడి వస్తే ఈ దఫా పదిహేను రోజులైనా నయంకాలేదు. శ్రీ స్వామి అతనిని నా దగ్గరకు పంపారు. ఇంటికెళ్ళి ఏవి చేస్తావని అడిగితే మామూలుగా కూలికి పోతానన్నాడు. అది సరే శ్రీ స్వామికి ఏమి చేస్తావంటే ఏమీ చేయనన్నాడు.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

'నీ చేలో గడ్డి మోపు నీ నెత్తి కెత్తాననుకో, నేను మీ గ్రామంలో కనిపిస్తే నీవు ముందుగా నన్ను పలకరిస్తావా లేక నేనే పలకరించాలా' అని అడిగితే `నేనే మిమ్ములను పలకరిస్తానన్నాడు'. '**గడ్డిమోపు ఎత్తి నందుకే అంతగా నన్ను గుర్తుపెట్టుకున్నావే, ఏ విధంగానూ నయంగాని జబ్బునయం చేసిన శ్రీ స్వామిని ఇంకెంతగా గుర్తు పెట్టుకోవాలో ఆలోచించు. మీ ఇంటి గోడకు శ్రీ స్వామివారి చిన్న పటం తగిలించి రోజూ ఒక సాంబ్రాణి కడ్డీ వెలిగించి నమస్కరించుకో. ప్రతిసారి అన్నం తినేటప్పుడు మొదటి ముద్ద శ్రీ స్వామివారికని తీసి బయటపెట్టు. నిత్యం వారిని ఏమారకుండా ఇలా తలుచుకో'** అని చెప్పాను. అలాగే చేస్తానని చెప్పగానే అతని వ్యాధి నయమైంది. ఈనాటికీ చక్కగా కష్టం చేస్తున్నాడు. కృతజ్ఞతా భావం ఎంత ముఖ్యమో చూడండి.

నెల్లూరు జ్యోతినగర్ 2వ వీధి నివాసి వయస్సు ఇరవై సంవత్సరాలు - ఆమె మనసు పనిచేయదు అలాగే చూస్తుంది. ఏదీ సరిగా తినదు. నిద్రపోదు. ఆమె టీచర్ గా పనిచేసి సంపాదిస్తే ఇల్లు గడుస్తుంది. యంత్రతంత్రాలు, దాటింపులూ, ఆస్పత్రి వైద్యాలు అన్నీ చేయించి అప్పుల పాలైనా నయంకాలేదు. ఒకరి సలహా పై గొలగమూడి వెంకయ్య స్వామి నాశ్రయించారు. మూడవనాటికి పూర్తిగా నయమైంది. ఎందరు ఉండమని చెప్పినా వినకుండా ఇంటికి వెళ్ళారు. మూడవనాటికి తిరిగి అనారోగ్యమైంది. మరలా గొలగమూడి వచ్చారు. ఈ దఫా ఏడురోజులకు నయమైంది. తిరిగి ఇంటికి పోయారు. మరలా తిరగబెట్టింది. మరలా

గొలగమూడి వచ్చారు. పదిరోజులకు కొద్దిగా తగ్గిందికాని సంపూర్ణ ఆరోగ్యం రాలేదు. ఇరవై రోజులకు పూర్తిగా నయమైంది. ఎంతో కష్టం మీద నలభై రోజులు ఉన్నారేగాని పొమ్మని శ్రీ స్వామి చెప్పినంత వరకు వుండలేదు. ఇంటికి వెళ్ళి వాళ్ళ గొడవల్లో వాళ్ళేగాని శ్రీ స్వామివారికి కృతజ్ఞతా భావంతో ఇంట్లో సేవించలేదు. ఆమెకు పెండ్లి చేశారు. మరలా మొదటిలాగానే అనారోగ్యమయింది. మరలా గొలగమూడి వచ్చారు. అనంత కరుణామయుడైన శ్రీ స్వామివారు కృప చూపారు. ఏమాత్రం జ్ఞానమున్నా శ్రీస్వామివారికి కృతజ్ఞతతో నిత్యం పారాయణ, ప్రదక్షిణలు చేస్తూ అందరిలో శ్రీ స్వామివారు ఉన్నారనే భావనతో జీవిస్తుంటే ఇన్ని మార్లు అనారోగ్యం పాలుకావడం జరిగేది కాదు.

**– "స్వామి అనుగ్రహం"** పుస్తకం నుండి.

సార్ తన చిన్నతనంలో ఆర్ధిక పరిస్థితి వల్ల తమ ఇంటి యజమాని ఇంట్లోంచి వెళ్ళమని సామాన్లు బయట పెట్టిస్తున్నప్పుడు, సార్ మేనమామ వచ్చి డబ్బులిచ్చి ఆదుకున్నారు. ఆ కృతజ్ఞతగా ఆ మేనమామ పెద్ద కూతురుని పెళ్లి చేసుకుందామనుకున్నారు. సార్ వాళ్ళ తల్లిగారికి, అన్నయ్యకు ఇది  ఇష్టం లేదు. ఎందువలన? అయిన సంబంధం, ఎక్కువ కట్నం రాదని! కానీ సార్ పట్టుపట్టి కుమారి శేషమ్మను పెళ్లిచేసుకున్నారు. అమ్మగారు శ్రీ సార్ కు తగిన సహధర్మ చరిణిగా నిలిచారు.  శ్రీ మాష్టారి, శ్రీ

స్వామి సేవ చేసుకోవటంలోను, స్థిరమైన నివాసం కలిచేడులో ఉండగా సార్ ఆరోగ్యం కై ఈ వసతులు లేని గొలగమూడి నివాసము నకు రావటం, అచ్చట ఎందరో స్వామి భక్తులకు ఆశ్రయం కల్పించటం దగ్గర నుండి, స్వామి సేవకు వారిరువురు తను మన ధనాలతో కృతజ్ఞతా మాయమైన జీవనానికి మరో పేరుగా నిలవటం ఈ గురు దంపతుల సమర్పణ కాగా, కృతజ్ఞతా జీవనానికి గురు కృప ఎంతగా వర్షిస్తుందో మనందరికీ మార్గదర్శకం.

ఓం గురుభ్యోనమః

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

Dear Raja,

**భోజనం చేయబోతూ కాకబలికి సమర్పించే విషయంలో మనం ఒక ముద్ద తీసి బయట పెట్టే పద్దతిలో మన భావన ఎలా ఉండాలి** అనే విషయం - "మహాత్ముల ముద్దు బిడ్డడు" గ్రంధంలో 147 వ పేజీ, పై నుండి 19వ లైను, కిందనుండి 9వ లైను.

భోజనం ప్రతి ముద్ద నివేదనలో తీసుకోవడం. నివేదన వివరంగా మనస్ఫూర్తిగా పెట్టాలి, యాంత్రికంగా కాకుండా –

ఇందులోని ప్రతి పదమూ చాలా విశాలమైన అర్థంతో కూడుకున్నదే - నివేదన అంటే అన్ని జీవులలోని భగవంతునికి ముందు నివేదించాలి. ఆ

నివేదన వివరంగా ఉండాలి. ప్రతిరోజు ఒకే రకంగా కాకుండా రోజుకొకటి తీసుకొని స్మరించడం- ఒక రోజు బియ్యం గింజ రావాలంటే ఎన్ని జీవుల కృషి ఉంది అన్నీ వరుసగా స్మరించు, 2వ రోజు ఒక్కో కూరగాయ రావాలంటే, 3వ రోజు ఒక్క బొట్టు పాలూ మజ్జిగ రావాలంటే, 4వ రోజు ఒక్క బొట్టు చమురు రావాలంటే, 5వ రోజు వంట చెరకు, 6వ రోజు వంట పాత్రలు, 7వ రోజు వంట చేయుటకు సహకరించు మనుషులు, ఇతర జీవులు తిరిగి ఇదే కమంలో స్మరించు. ఆయా జీవుల రూపంలో ఉన్న పరమాత్మకు కృతజ్ఞతలు తెలపడం.

అలా ఎందుకు చేయాలి? భగవంతుని కృప పొందుట కొరకు చేయాలి. మనం చేసే అష్టోత్తరాలు, సహస్రనామాలు, రుద్రాలు అందలి నమకచమకాలు, మంత్రపుష్పాలు, సాయి హారతులు అన్నీ భగవంతుని స్మరించేందుకే. **వీటన్నింటి లక్ష్యం ఒక్కటే. అన్నింటిలో ఒకే పరమాత్మ ఉన్నాడు** అని మరలా మరలా గుర్తుచేస్తుంటేనైనా, నీకు “నేను” అనే బేధ భావమనబడు అడ్డుగోడ కూలి అంతటా ఉన్న పరమాత్మ భావమైన కల్గుతుందని తద్వారా రాగద్వేషాలు నశిస్తాయని. ఎంతో లోచూపు గల మహనీయులు మార్పుకోరే మన మనస్సుకు నచ్చేటట్లు అష్టోత్తరాలను, సహస్త్రనామాలని మంత్ర పుష్పాలని, రుద్రమని, హారతులని ఏర్పాటు

చేశారు. అర్థం తెలియకుండా ఎందుకు చేస్తున్నామో తెలియకుండా యాంత్రికంగా చేస్తే ఫలితం స్వల్పం. అందుకే సాయి విష్ణు సహస్ర నామాన్ని అర్ధముతో స్మరించమన్నారు.

పె.సుబ్బరామయ్య.

**************** సద్గురు దేవా శరణం శరణం**************

గొలగమూడి

16-03-1999

పూజ్య గురుబందు శ్రీమతి లక్ష్మక్క గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. ఉభయకుశలోపరి. మీ సత్సంగం తరపున శ్రీ దర్గా స్వామి వారితో మీ అందరి అనుభవాలు వ్రాసి పంపించారు. చాలా సంతోషము. శ్రీ దర్గా స్వామి వారిని చూచే భాగ్యము నాకు కలుగలేదు. శ్రీ స్వామి వారి దయ ఎలా ఉంటే అలాగే జరుగుతుంది.

మీతో వారు మాట్లాడిన మాటలన్నీ ఒక ఎత్తైతే **"పిల్లి, పిల్లను పట్టుకోవడం"** అన్నమాట ఒక ఎత్తు. ఇందులో మనము పిల్లల వంటివారము, ఆ సద్గురుమూర్తి పిల్లిలాంటి వారు. వారు మనలను ఎంతో


జాగ్రత్తగా పట్టుకొని గమ్యం చేరుస్తున్నారు. గనుక మనకెలాంటి చింతలేదు. మన కర్తవ్యమొక్కటే - కదలకుండా ఉండటం. ఆ సద్గురుమూర్తి క్షేమంగా మనలను గమ్యం చేర్చేందుకు ఆస్కారమివ్వడమే. ఆచరణకు ముందు మన హృదయంలో అలాంటి మార్పు జరగాలి గదా? ఆ మార్పు తెచ్చేబాధ్యత శ్రీ గురురాయునిది. మనకు తెలియకుండానే మన హృదయంలో అలాంటి మార్పు తెస్తారు. **మనకు జరిగే సన్నివేశాలన్నీ "మన మంచికే సద్గురు మూర్తి జరిపిస్తున్నారు" అన్న ఎరుక ఏ మారకుండా మనకు వ్యతిరేకంగా ఉన్న వాటికి కూడా కృతజ్ఞతా భావంతో ఉండాలట.** ఎందుకంటే ఆ సన్నివేశం ప్రస్తుతానికి మనకు వ్యతిరేకంగా మన దృష్టిలో ఉండవచ్చు. కానీ శ్రీ సద్గురు మూర్తికి అది మన మంచికేనని చక్కగా తెలుసు. గనుకనే ఆ సన్నివేశం జరుగనిస్తున్నారు. **పిల్లి తన పిల్లను పట్టుకొని కొత్త స్థలానికి చేర్చేటప్పుడు, ఆ పిల్లకు ఎంతో అసౌకర్యంగా బాధగా కూడా ఉంటుంది. కానీ పిల్లి క్షేమాన్నే దృష్టిలో పెట్టుకొని తల్లి అలా చేస్తుంది. గనుక తమకు నేను చెప్పనక్కరలేదు. తన కప్పచెప్పబడ్డ ప్రతి పైసాను భగవంతుని చేర్చే బాధ్యత శ్రీ సాయినాధుని భుజస్కందాలపై ఉంది. ఆచరణను అనుభవం ద్వారా తేవచ్చు. మాటలు చెప్పి మన నడవడి మార్చవచ్చు. మాటలకందని విధంగా దృష్టి తోనే మనలో మార్పు తేవాలి. ఏది ఏమైనా ఆ శ్రీ గురురాయుని చేతిలో**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టార్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

**కీలుబొమ్మల వలె ఆడడం తప్ప మనకు స్వేచ్ఛలేదని గుర్తించి మనకు నలుమూలల నుంచి వచ్చే సలహాలు శ్రీ గురుమూర్తి మనపై ఎనలేని దయలో పంపినవేనని మన సాధనకు పనికి వచ్చే సూచనలు సలహాలు పాటిస్తుంటే క్షేమంగా గమ్యం చేరుతాము.** వివేకం పెంచుతారు. సర్వం చూస్తారు. లౌకిక, ఆధ్యాత్మిక బాధ్యతలు మనకేమీ లేవు. మన బాధ్యతలన్నీ వారివే.

**నీ పాదాల చెంత చేరాను. నా పై కరుణించి గమ్యం చేర్చు తండ్రీ అని మాత్రం నమస్కరిస్తు పఠన, మనన, నిధి ధ్యాసలు చేస్తుంటే సర్వం వారు ఒనగూర్చుతారు.**

**మనం వారి మాటలు అర్థం చేసుకున్నా, చేసుకోకపోయినా ఆ విశ్వరూపుడు మనలో ప్రేరణ పెట్టి మనలో అవసరమైన మార్పు తెచ్చి తీరుతారు.** మనం రైలు track పైన ఉంటే గమ్యం చేరడం తద్యం. మన బోగీలు పట్టాలు తప్పితే మరుక్షణమే accident, గమ్యం చేరలేము.

శ్రీ గురుమూర్తి మనకు తగు ఆచరణ, మార్పు తీసుకు రావాలని ఆశిస్తూ

నమస్కారములతో

సుబ్బరామయ్య

మర్కటకిశోర న్యాయం కాకుండడమే మన అదృష్టం, మర్కట కిశోర న్యాయంలో కోతిపిల్ల తల్లిని పట్టుకోవాలి గదు. గనుక పిల్ల కోతికి బాధ్యత ఉంది, మీకలాంటి బాధ్యతలేదు చాలా సంతోషం.

*************** సద్గురు దేవా శరణం శరణం**************

గొలగమూడి

19-11-1997

పూజ్య D.నాగేశ్వరరావు మాష్టారు గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. మీరు రాజు ద్వారా పంపిన 175 రూ|| అందినవి. మీరు నాకు అంత మొత్తం బాకీ ఉన్నారా? నాకు గుర్తులేదు, మీకు రావలసియుంటే తెలపండి. పూజ్యశ్రీ మాష్టారి గారి దయతో వారు వాయించిన వారి దివ్యవాక్కులు వ్రాయడం అయిపోయింది. ఆ కాగితాలన్నీ అమ్మగారు చదివి అన్నీ వారే శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్ కింద ఒక పుస్తకం వేస్తామని ఆ కాగితాలు ఒక క్రమంలో పెట్టి, పేజీ నెంబర్లు వేసి పంపమని నాకు పంపారు. **అతి చిత్రంగా ఒక వారం రోజులలో సుమారు 20 పేజీలకు పైన "<u>హత్ దరూన్ చలాన్</u>" అనే ఒక అధ్యాయం వ్రాయడం జరిగింది. బాబాగారి ఆజ్ఞలు శ్రీ మాష్టారు గారు ఎలా ఆచరించారు. మనం**

**మాష్టరుగారు చెప్పింది ఎలా ఆచరించాలి అనే విషయాలు చర్చించాను.** తర్వలో అమ్మగారే ప్రచురించబోతున్నారు.

అందులో ఒక విషయం మీ సత్ సంగీయులు విన్న విస్తున్నాను, **మేము ఎప్పుడు మాష్టరుగారిని ఆహారం విషయం ప్రశ్నించినా "యుక్తాహార విహారస్య" అన్న గీత శ్లోకం, తిరిగి తిరిగి అనేక భంగిమలలో కోణాలలో విశదీకరించారు.** అయితే సాయి గానీ, ఇతర మహనీయులు కానీ స్పష్టంగా అదే రూపంలో వచ్చి మన స్వప్నంలో వచ్చి మనలను ఆచరించమని ఆహార నియమాలు చెబితే, తప్పక పాటించమన్నారు. వేరే రూపాలలో స్వప్నాదేశాలు వస్తే వాటిని నమ్మవద్దని ఖండితంగా చెప్పారు. **ఆయా మహనీయులు మన స్వప్నంలో ఆదే రూపంలో వచ్చి స్పష్టంగా చెబితే ఆ సందేశం ఆచరించినందువల్ల మన శరీర తత్వంలో చక్కని మార్పు రావాలని మనకు ఆలసట, బలహీనత ఉండరాదు అని చెప్పేవారు.** అందుకు నేనే ఉదాహరణ. నాకిచ్చిన ఆదేశాలు సంపూర్ణంగా స్పష్టంగా వారిచ్చినవే. గనుక గత 20 సం||ల నుండి వాటిని పాటిస్తున్నా నా ఆరోగ్యం మెరుగు పడుతుంది. రోజుకు 18, 20 గం|| పనిచేసినా అలుపూ సొలుపూ ఉండదు. పని అంటే కాయ కష్టం చేయలేను. కానీ కూర్చోని చక్కగా గంటల తరబడి మాట్లాడడం, వ్రాయడం, పూజ, ధ్యానాదులు చేయడం వంటి పనులు

అంతకు ముందు ఆ నియమాలు పాటించకుండా అన్నీ తింటున్నప్పటికంటే చక్కగా చేస్తున్నాను, చేయగలుగుతున్నాను. అయితే మూడు వేళలా ఆ ఆహార నియమం ప్రకారమే మితంగా తినుచున్నాను. గనుక సాధకులు అన్నం విషయంలో (ఆహారం) రొట్టి, పాలు పండ్లు ఏవైనా మన శరీర తత్వానికి సరిపడినవి మితంగా తప్పక తీసుకోవాలి. అలా తీసుకోకుంటే మాష్టరుగారి కంటే, గీతాచార్యులు కంటే మనమే ఎక్కువ తెలిసిన వారమవుతాము.

**గురువు చెప్పినట్లు చెయ్యి, వారు చేసినట్లు చేయవద్దు అని అందుకే అన్నారు**. బాబా పన్నెండేళ్ళు అన్నం తినకుండా వేపాకు తిన్నారు. మిలారేపా గుంటకలగరాకు ఉడికించి తిన్నారు. ఆవి తిన్నందుకు వారికి బలహీనత రాలేదు, అదే మౌనభోద అనేందుకు నిదర్శనము. మాస్టరుగారు ఆ విధంగా ఎప్పుడు ఆహారం తినకుండా ఉండలేదు. వారి శరీరతత్వానికి సరిపడిన పదార్థాలు, మూడు పూటలుగాని, నాలుగు పూటలు గాని మితంగా తీసుకునే వారు. మేము డజను ఇడ్లీలు తింటుంటే మాష్టరుగారు రెండు లేక మూడు తినేవారు, నాలుగు తినేవారు. అవి మీకెట్లా సరిపోతాయి సార్ అంటే ఆ విషయం సాయినడుగు అనేవారు. బ్రూ కాఫీ కనీసం రోజుకు

ఇరవై మార్లు తాగేవారు. ఆ విధంగా యుక్తాహార విహారంగా జీవితయాత్ర గడిపారు. అలాగే మనలను ఆచరించమన్నారు.

కొంపతీసి మీరు అలాచేసేరు స్వామీ !, తెల్లవారి నుండి బడిలో పాఠాలు చెప్పలేరు. నేను బడికి వెళ్ళినన్ని రోజులు ఉప్పు, కారం, పులుపు నూనె లేని ఆహారం మామూలుగానే పావుశేరు బియ్యపన్నం తినే వాడిని. ఇది క్రమంగా తగ్గింది. అది నేను కావాలని తగ్గించ లేదు. అదే క్రమంగా తగ్గింది. కానీ నాకు అలుపూ, సొలుపూ లేదు. అదే వరుపురాతి పరీక్ష. దీనిని లక్ష్మక్క గారి ద్వారా అందరికీ చదివి చెప్పించండి. వీలును బట్టి తిరిగి వాస్తాను.

నమస్తే

PSR

జితే జిహ్వే సర్వం జితే అని ఒక మాట ఉంది. అంటే జిహ్వ = నాలుకను జయించినట్లయిన సర్వము వశమగును. సర్వం జయించినట్లే అని భావం. అందుకని ఇది చాల సులభమేనని M.Sc Physics చదివిన post graduate కలిచేడులో "ఉడికిన పదార్థం తినను" అని నియమం పెట్టుకొని వడపప్పు, పాలు, పచ్చి కొబ్బరి, అరటిపండ్లు తినసాగాడు. 6

నెలలకు ఏమీ జయించలేక పోయాడు కానీ ఆహారం ఈయనను జయించింది. ఇతనికి కాళ్ళ కీళ్ళు పట్టుకొని వాతము ఎక్కువై, చనిపోయే స్థితిలో, ఆస్పత్రికి చేర్చి తిరిగి బాగైనాక వారి గురువైన విద్యాప్రకాశానందగిరి స్వామి శ్రీ కాళహస్తి తీసుకుపోతే ఆయన చెప్పినా పట్టువీడలేదు. ఆయన నీవు శిష్యుడవు కావూ, నేను నీకు గురువు కాను, నీ నియమానికే నీవు దాసుడవు అవుతున్నావు పొమ్మని పంపేశాడు. ఆ తర్వాత 6 నెలలకు ఎన్నో అనారోగ్య పరిస్థితులకు గురై మొదట 12 సం|| పాటించాలని దానితోటి మౌనం కూడా పెట్టుకున్నాడు. 2 సం|| కాక ముందే రెండు నియమాలు మానేసి మౌనం చాలించి అన్నం తింటూ తిరిగి సాధన సాగించారు.

అందుకే మాష్టారుగారు చెప్పేవారు. సాధనకు సాత్వికాహారమని చెప్పారేగానీ, ఎవరి వంటి తత్వానికి ఏది పడితే, ఎంత సరిపోతుందో అదే వారికి సాత్వికాహారమని చెప్పేవారు. కడప స్వామి, కాళహస్తి గోపాల స్వామి వారు పచ్చి మాంసము, సారాయి తీసుకునేవారు. మరి వారు మనసునరికట్టలేదా? కావలసింది మనసును అరికట్టడం. జిహ్వా చాపల్యం వలన ఏదంటే అది తినకుండా టైంటు టైం మాత్రం తినాలి మితంగా.

కొందరు బాబా ఇచ్చిన దానితో తృప్తి చెందక, ప్రసాదించబడిన దానికి కృతజ్ఞతా భావంతో, ముందుకు పోయే కృషి చేయక ఘోరమైన నియమాలతో శరీరాన్ని కష్టపెడుతారు. బాబాకు తలనొప్పి కల్గిస్తారు. దీన్ని మాష్టారుగారు చెప్పేవారు - పండు చెట్టు పండితే, రుచి అద్భుతంగా ఉంటుంది. మనం తొందరపడి పొగపెట్టి మాగవేస్తే అంతటి అద్భుత రుచిరాదు కదా, ఒక్కొక్క సారి పండు పాచిపొయ్యే ప్రమాదముంది అనేవారు. గమక **బాబా ప్రసాదించిన దానితో తృప్తి చెంది ఆయన చెప్పినట్లాచరించడమే మన కర్తవ్యం.** అసలు మనకేమి తక్కువ చేశాడని ఇంకా కావాలని మనం ఘోరమైన నియమాలు పాటించి శరీరానికి బాధ కల్గించాలి? మూఢుడనైన నాకేమీ కావాలనిపించదు. ఏదో తింటున్నాము. ఆయనను చూస్తున్నాము. ఆనందిస్తున్నాము, ఇంక అంతకన్నా నాకేం కావాలి. ఏదైనా నేనుగా ఏమీ కోరను అందుకుగాను ఆహారనియమాలు పాటించను. ఆయన ఆదేశించారు గనుక ప్రస్తుత నియమాలు పాటించినా అలుపూ, సొలుపూ లేదు. అది వారి ఆజ్ఞ కదా.

యదా సర్వే ప్రముచ్యంతే కామా యేఽస్య హృది శ్రితాః |

ఆశపోతే అంతా పోతుండాయ్య, కావాలి అనే కోరికలన్నీ వీడి నన్నే శరణువేడు, ఇవన్నీ ఒకే గమ్యాన్ని నిర్దేశిస్తూ మనం చేయవలసిన దాన్ని కూడా చెపుతున్నాయి, మరొక సారి వ్రాస్తాను.

నమస్తే

పె.సుబ్బరామయ్య.

**మాష్టరుగారు ఎప్పుడూ ఆధ్యాత్మికంగా గానీ, లౌకికంగా గానీ మనకంటే గొప్ప వారిని కాదు మనకంటే తక్కువ వారిని చూస్తుంటే బాబా మనకిచ్చిన దివ్య సంపదేదో అర్ధమవుతుంది అని చెప్పేవారు గనుక మనమున్న పరిస్థితికి బాబాకు కృతజ్ఞతా పూర్వకంగా వారు చెప్పిన బాటన నడువు.**

****************** సద్గురు దేవా శరణం శరణం***************

గొలగమూడి, 27-8-05


పూజ్య గురు బంధువులైన లక్ష్మక్క గారికి చి||సాయికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం. శ్రీ స్వామివారి అడుగుజాడలలో గానీ శ్రీ మాస్టారి అడుగుజాడలలో కానీ శ్రీ సాయీశుని మార్గములో మనం సంపూర్ణంగా నడవలేకపోయినా ఫరవాలేదు. నడిచేందుకు తీవ్ర ప్రయత్నమైనను చేయాలి. తీవ్ర ప్రయత్నం కూడా


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

చేయలేకున్నామంటే ఆ మహనీయులు ఆంగీకరిచారు. వారేమి మనలను మితిమీరిన కష్టం చేయమనడం లేదు. మనస్సంతా వారి కర్పించమనడమూ లేదు. ప్రతి నిత్యము కొంతకాలం వదలకుండా నామం చేయమనుచున్నారు. అన్నం బయట పెట్టేటప్పుడు మన కృతజ్ఞతా భావం ఎంత తీవ్రంగా హృదయ స్పందనతో ఉంటుందో చూచుకోమన్నారు. ఈ విషయంలో 2సం|| క్రిందటి నా భావనకు నేడు నా భావనకు చాలా భేదముంది. నేను శారీరక బలములో చాలా బలహీనుడనయ్యాను. కానీ నా భావనలో చాలా మార్పు వచ్చింది. మంచినీళ్ళు త్రాగుతుంటే పంచ భూతాత్మ స్వరూపాయ నమః అనే మాట రోజులో ఎన్నిమార్లు త్రాగితే అన్ని మార్లు గుర్తు రావడం ఎంత విచిత్రమో గదా!

మందిరం వాళ్ళు పూజ చేయవద్దు అంటే ఇంతకు ముందు వాదనకు దిగేవాణ్ని. కానీ నేడు అంతయూ మన మేలునకే. శ్రీ స్వామి సర్వ సమర్థులు గనుక ఇది నా మంచికే అనే భావన చెదరకుండా ఉంది. ఇది నాకే విచిత్రంగా ఉంది. ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. సప్త సముద్రాల అవతల ఉన్నా నిన్ను కాపాడుతానని సాయికి వారి గురువు చెప్పినా సాయికి కష్టాలు తప్పాయా. కుస్తీలో ఓడిపోయి ఊరి వెలుపల ఉన్నాడు. అందరూ తెచ్చుకునే నీటి తొట్టిలో తన డబ్బాను ముంచనివ్వలేదు. అంతటి మహానీయునే చంపాలని కర్ర ఎత్తాడు. వెలుగులోకి రాని ఇంకెన్ని బాధలు పడ్డాడో. ఆ పూటకు బియ్యం లేవు. ఇంటి బాడుగ కట్టగలడా. భార్య

వైద్యానికెట్లా? వచ్చే అతిధులనేమి చేయాలి. కులభ్రష్టుడని వెలివేయడం, తన సొమ్ము తిన్నవారే తనపై దుమ్మెత్తి పోయడం. వారికే తప్పనివి మనకు తప్పవు గదా? అంతయూ మన మంచికే.

**************** సద్గురు దేవా శరణం శరణం**************

## సార్ సత్సంగం

కోరికలు అన్నీ సిద్ధించును గురుకృప కలిగిన

కొన్ని రోజులు, కొన్ని సంవత్సరాలైనా ట్రైనింగ్ ఈయమంటాడు. ఇది (మనస్సు) ఏమవుతుంది అంటే దాని ఇష్టం వచ్చినట్టు ఎట్టెట్టో పోతూ ఉంటుంది. కొన్ని జన్మలుగా ఆ సంస్కారం లేదు. కనుక చెప్పినా చెప్పకపోయినా ఆ టైంలో అంతర్ముఖం అయ్యే దానికి నువ్వు ట్రైనింగ్ ఇవ్వాలా. ఆ ట్రైనింగ్ ఇప్పుడు మనం చేసేటటువంటి హారతులు. ఆ మిష పెట్టుకుని అక్కడికి వస్తాము మనం. ఆ కొంచెంసేపు అయినా సరే ఆయన స్మరణలో ఉండే దానికి ప్రయత్నం చేస్తే, అలా చేస్తూ ఉంటే అలవాటు అవుతుంది కొన్నాళ్లకు. అలా చెయ్యకుండా ఉంటే మొహం మొత్తినట్లు ఉంటుంది. ఎట్టట్టునో పిచ్చిగా పోతూ ఉంటుంది. అందుకని నువ్వు ఎన్ని పనుల్లోనన్నా ఉండు, ఎక్కడైనా కూర్చుని ఆ నువ్వు పని చేసే చోటునే రెండు నిమిషాలు, మూడు నిమిషాలు పనిని ఆపి ఆయనను స్మరించు. పనేమో ఆయన పనేనని చేస్తూ ఉంటాము. మన స్వంత పని అని చెయ్యము. కానీ

ఆయన పనేనని చేస్తున్నా మనస్సు మాత్రం పని వెంబడ పోవాల. పని వెంబడ పోకుంటే ఆ పని జరగదు. ఆ పనిని కూడా withdraw చేసి (నిలిపేసి) కొంచెంసేపు ఆయన్ని స్మరించు. అంతటా ఉంటే పరమాత్మను స్మరించు.  నువ్వు రూపం పెట్టుకొని చూస్తే రెండవ క్లాసు.  ఫస్ట్ క్లాస్ లోనే చేయాలి అంటే అంతా ఉండే పరమాత్మను స్మరించు. అది నీకు వీలు కాలా, నాకు రూప ధ్యానమే బాగుంది రూపంలోనే పెట్టుకుని చూడు. అట్లా ప్రతిరోజూ కొంత సేపు చూస్తూ ఉంటే మనస్సు అహగాహన వచ్చి ఆ టైం వచ్చేతలికి అది ఆటోమేటిక్ గా పరుగులు తోలుతుందట అంతర్ముఖం అయ్యేదానికి. అట్లా అంతర్ముఖం చేసేది కనుక బాగా నేర్పించినట్లు అయితే నువ్వు పొమ్మన్నా కూడా అది ఎక్కడకూ పోదు. గమ్మున కూర్చుంటుంది అక్కడ. అది ఎప్పుడయ్యా? అలా కూర్చుంటుంది అంటే ఆయన కృప కలిగినప్పుడు. ఆయన దానికి మంత్రం వేస్తాడు. ఏం చెప్తాడు. మనకు తెలియదు ఆయన సంకల్పం. ఈ మనస్సు నిలిచి పోవాలా అంటే గమ్మున నిలిచి పోతుంది అంతే! ఇక మరలా దానికి వేరే చలనమే ఉండదు. అంటే మూడు సంవత్సరాలు నేను తంటాలు పడ్డా, మూడు సంవత్సరాలు తంటాలు పడిన తర్వాత ఆయనకు కృప కలిగింది. కృప కలిగింది మనకి టైమే తెలియదు కూర్చుంటే! అట్లనే కూర్చొని ఉండటమే! అంటే మూడు సంవత్సరాలు మనకు అలివి కానటువంటి మనస్సు ఆ రోజు అలివయ్యింది.


అది మనకు అలివయ్యిందని కాదు ఆయన దయ వల్ల అది అలివయ్యింది. అట్లా ఎప్పుడయ్యా అంటే మూడు సంవత్సరాలు పట్టు విడవకుండా చేసినందుకు అయ్యిందని మాట! మూడు సంవత్సరాలు కూడా మనమిష్ట మొచ్చినట్లు చేస్తూ వస్తే! ఈ రోజు ఏడున్నరకి, రేపు ఏడుకి, ఇంకొక రోజు ఇంకొక టయానికి అది అలివై ఉండదు. మనము గట్టి పట్టుదలతో మూడు సంవత్సరాలు దాన్ని వేధించ బట్టి రాగా రాగా ఆయన కృప కలిగింది. వీడు వదిలి పెట్టేటట్టు లేడు అని. అప్పుడు ఆయన స్వస్థత చేకూర్చాడు. ఎక్కడ పెడితే ఆడనే! ఇకన టైమే తెలియదు. అట్లా కొన్ని నెలలు గడిచినాయి. నాలుగు ఐదు నెలలు గడిచిపోయింది అట్టనే! కనుక ప్రతి వాడికీ కూడా పట్టుదలగా ఎన్ని పనులో ఉంటాయి. నాకు అది పోతే బుడ్డ మునిగి పోతుందని. మన aim ఆ బుడ్డ మునిగిపోయేటటువంటి పని కాదు! **మనకు మనం పెట్టుకున్నటువంటి ఆశయం అది కాదు. ఈ పనులు తుంగలోకి పోయినా గురుకృప పొందాలా! గురుకృప కానీ ఉండినట్లైతే కోరికలన్నీ సిద్ధించును.** కాబట్టి ఎన్ని సిద్ధించినా, ఎన్ని సిద్ధించక పోయినా గురుకృప పొందటం ఒకటే మన యొక్క ధ్యేయము! గురుకృప పొందనప్పుడు ఎన్ని. ఎన్ని ఉన్నా కానీ కేవలము పిల్లకాయల ఆటే ! ఏదో ఉంటాయి మోటార్ సైకిళ్లు ఉంటాయి. కావాలంటే కార్లు ఉంటాయి. ఇంకేదైనా ఉంటాయి. ఇంకేదైనా ఉంటాయి. ఎన్ని ఉండినా అదంతా

పిల్లకాయలు ఆడుకునే ఆట లాంటిదే, కానీ బొమ్మలాట. అసలది కాదు. గురుకృప కలిగినట్లైతే లేనిది ఉండదు. లేదంటే వీడికి గురుకృప కలిగే సమయం వచ్చిందంటే ఫలానిది కావాలనేదే ఉండదు. ఆనందంగా ఉండగలుగుతాడు. అట్లాంటి ఆనందాన్ని నీవు అనుభవించాలంటే, ఏమీ లేకుండా ఆనందాన్ని అనుభవించటం. అన్నీ పెట్టుకొని మెంటల్ టార్చర్ ని అనుభవించటం కాదు. ఇప్పుడు అన్నీ ఉండేవాళ్ళకి మెంటల్ టార్చరే! ఏమీ లేదు మట్టి గడ్డలు. లోకం దృష్టిలో మాత్రం వాడికి కార్లు ఉన్నాయి రా, వాడికి మిద్దెలు ఉన్నాయి రా అనుకుంటారు కానీ వాడు పడే చిత్రహింస ఎవరికీ తెలియదు. ఏమీ లేకుండా ఉంటే మాత్రం హాయిగా ఉంటాడు వీడు. ఏమీ లేకుండా ఎట్లా ఉంటుంది అయ్యా హాయి అంటే ఉంటుందది. హాయి ఎట్లా ఉంటుందో! అది అనుభవిస్తే తెలుస్తది, ఆ హాయి ఎట్లా ఉండేది. మనస్సు వేరే వాటి మీదికి పోతే కదా! మనసు వేరే వాటిని ఆలోచిస్తూ ఉంటే అప్పుడు వీడికి ఏదైనా కావలసి వస్తుంది. మనసు వేరే ఆలోచనకే పోక పోయె, అట్లాంటప్పుడు ఆనందంగానే ఉంటాడు వీడు. కనుక మనం పట్టుదలగా కనీసం ఆరతికి వచ్చి కూర్చోటం అనేది పట్టుదలగా చేస్తూ ఉంటే అప్పుడు ఏ రోజుకో ఒక తూరి మనల్ని అనుగ్రహిస్తారు తప్పకుండా!

**శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి మహారాజ్ కీ జై జై**
**గురుదేవ దత్త**









## మహాత్ముల వాక్యాలు

1. నాపై నీ దృష్టి నిలుపు. నేనూ నీపైన నాదృష్టి నిలుపుతాను.
2. గురువును సంపూర్ణంగా (అంటే అన్నింటికీ, అన్ని కాలాల్లోనూ, పరిస్థితుల లోనూ) నమ్ముకో, అదే అసలైన సాధన.
3. గురువే అన్ని దైవాలున్నూ, సాధన చతుష్టయం, శాస్త్రషట్కం అక్కర్లేదు. గురువుయొక్క దృష్టే శిష్యుడికి అన్నపానీయాలు.
4. నువ్వు నిశ్చలంగా కూర్చో, అవసరమైనదంతా నేను చేస్తాను. నేను నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను.
5. నన్ను నమ్మిన వారినెన్నడూ పతనం కానివ్వను.


- శిరిడీ సాయిబాబా



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**

# గురు పూర్ణిమ సందర్భంగా గొలగమూడి సద్గురు శ్రీ సుబ్బరామయ్య బృందావనములో రుద్రాభిషేకము








శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

